క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక స్కిల్ కళాశాలలో ఉచిత కంప్యూటర్, ఇంగ్లిష్ శిక్షణ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైటీసీ ఇన్‌చార్జ్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల పాటు ఇవ్వనున్న శిక్షణలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ కలిస్తామన్నారు. శిక్షణకు ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపైన చదివిన వారు అర్హులన్నారు. మార్చి 12లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 70320 60773, 63034 64426 నంబర్లను సంప్రదించాలన్నారు.

శ్మశానవాటికను బాగుచేయండి

జియ్యమ్మవలస రూరల్: అస్తవ్యస్తంగా ఉన్న మండలంలోని చినకుదమ గ్రామ శ్మశానవాటికను బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో శ్మశానం చుట్టూ నిర్మించిన ప్రహరీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, తాగునీటి బోరు కూడా మరమ్మతులకు గురైందని దీంతో ఎవరు మృతి చెందినా వారి అంత్యక్రియల నిర్వహణ కష్టమవుతోందన్నారు. అధికారులు స్పందించి, శ్మశానవాటికలో పేరుకుపోయిన డొంకలు, తుప్పలు, పిచ్చిమొక్కలు తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతిమ సంస్కారాలకూ అవస్థలే..

వీరఘట్టం: మేజర్ పంచాయతీలోని దొంతర వీధి వాసులకు సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో నిత్యం నరకయాతన పడుతున్నారు. ఈ విషయం పక్కనపెడితే వీధిలో ఎవరైనా చనిపోతే ఆ శవాన్ని శ్మశానవాటికకు తీసుకువెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో ఈ వీధి వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీధిలో ఓ వ్యక్తి గురువారం కన్నుమూయడంతో మృతదేహాన్ని శ్మశానికి తీసుకెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కోరినా.. ఇంతవరకు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానికి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన తగదు..

భామిని: త్వరలో జరగనున్న పది, ఇంటర్ పరీక్షల్లో ఆందోళన చెందకుండా నిదానంగా రాయాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ రూపావతి సూచించారు. మండల కేంద్రంలోని గురుకులాన్ని గురువారం సందర్శించి.. పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మానసిక ఒత్తిడిని జయించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రిన్స్‌పాల్ విజయనిర్మలతో కలిసి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో గురుకుల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం

పార్వతీపురం టౌన్: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పసుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయ అర్చకులు సురేష్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కల్యాణ వేడుకను నిర్వహించారు. ప్రతీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది.

విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

మక్కువ: ఐఎఫ్‌టీయూ సంఘాల విలీన సభ రాజమండ్రిలో త్వరలో జరగనున్న సందర్భంగా కార్మికులంతా పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.గోపాలం కోరారు. మక్కువలో ఐఎఫ్‌టీయూ మండల గౌరవాధ్యక్షుడు ఆధ్వర్యంల గురువారం సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్టూ పేరుతో ఇప్పటి వరకు వేర్వేరుగా పని చేస్తున్న రెండు విప్లవ సంఘాలు ఇక ఒకే సంఘంగా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.గౌరు, ఎ.అప్పారావు, పి.గంగరాజు, ఆర్.అప్పారావు, బి.అప్పారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతితో..

విద్యాకాంతులు

- అంగన్‌వాడీలకు ప్రత్యేక శిక్షణా తరగతులు
- ప్రీస్కూల్ పిల్లల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం
- ఆటపాటలతో కూడిన విద్య, ఆరోగ్యమే ప్రధానంగా శిక్షణ

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రీప్రైమరీ స్కూళ్లగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల వయసు గల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించేలా జ్ఞానజ్యోతి కార్యక్రమం పేరిట ప్రత్యేక శిక్షణా తరగతులకు శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలను టీచర్లుగా మార్చేలా ఈ శిక్షణ దోహదపడుతుంది. కేంద్రానికి వచ్చే పిల్లవానికి ఏ విధంగా విద్య నేర్పిస్తే ఆ చిన్నారికి చదువు వస్తుందన్న కోణంలో శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఇది చిన్నారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు తీసుకువచ్చే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్ బి-పడాయి-బి.. పథకం అమలుపై కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖాధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన శిక్షణా తరగతులకు సమగ్ర శిక్షా అదనపు సమన్వయకర్త ఆర్.తేజేశ్వరరావు హాజరై, అంగన్‌వాడీలకు పలు సూచనలు చేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే పునాదులు..

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని, మానసిక నిపుణుల సూచనల మేరకు 0-6 సంవత్సరాల వయసు గల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి బంగారు భవిష్యత్‌కు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బలమైన పునాదులు వేసింది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రతి కేంద్రానికీ ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం జరిగింది.

శిక్షణ ఇలా..

మాతాశిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) ప్రొగ్రాంలో భాగంగా మండలంలోని 60 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు 1,280 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 966 మంది చిన్నారులు.. ప్రయోజనం పొందనున్నారు.

బాల్యారంభ సంరక్షణే లక్ష్యం..

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధి ఈ శిక్షణ లక్ష్యం. శారీరక, సామాజిక భావోద్వేగం, నైతికత, మేధాభివృద్ధి, భాష-అక్షరాస్యత, సౌందర్య-సాంస్కృతిక అభివృద్ధి అనే అంశాల ప్రామాణికంగా చిన్నారుల భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా 120 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు అందిస్తారు. ఈ మూడేళ్ల వ్యవధిలో ఏడాదికి 40 రోజుల చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ అందిస్తారు. తొలి దశలో 20 రోజులు, మలి దశలో 20 రోజుల చొప్పున ఇస్తున్న ఈ శిక్షణను హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. అంటే ఆరు రోజుల పాటు ఆఫ్‌లైన్, 14 రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇస్తారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు కొనసాగుతాయి. విద్యాశాఖ, సమగ్ర శిక్ష, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ పర్యవేక్షణలో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు.

శిక్షణ ఎంతో ఉపయోగం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యకర్తలకు ఇస్తున్న ఈ శిక్షణ ఎంతో ఉపయోగం. చిన్నారులకు ఏ విధంగా విద్యాబోధన చేయాలన్నది నేర్పిస్తారు. శిక్షణానంతరం అంగన్‌వాడీలు చేసే విద్యాబోధన చిన్నారుల విద్యాప్రగతికి బాటగా నిలుస్తుంది.

–జి.సుగుణకుమారి, ఐసీడీఎస్ పీవో, కొమరాడ



శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీలు



శిక్షణార్థులకు సూచనలిస్తున్న ఏపీసీ తేజేశ్వరరావు

ఓటెత్తిన అయ్యవార్లు..



గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్



వీరఘట్టం: ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ యశ్వంతకుమర్ రెడ్డి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఓటర్లకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేయగా.. అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులకు మద్దతుగా పలువురు మద్దతుదారులు పోలింగ్ కేంద్రాలకు కొద్ది దూరంలో శిబిరాలు ఏర్పాటు చేసి, ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

– పాలకొండ/కురుపాం

సక్రమంగా పింఛన్ల పంపిణీ చేపట్టాలి

జియ్యమ్మవలస రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో ఎస్.రమేష్ సూచించారు.

మండలంలోని అలమండ గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మార్చి ఒకటో తేదీనే పింఛన్ డబ్బులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇవ్వాలని తెలిపారు. పింఛన్‌దారులను ఎండలో నిలబెట్టవద్దని, సమయపాలన పాటించాలన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రమేష్

గిరిజనులతో మమేకమయ్యేందుకే సేవా కార్యక్రమాలు

- పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన

మక్కువ: గిరిజనులతో పోలీసులు మమేకమయ్యేందుకే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా తరచూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ అంకిత సురాన అన్నారు. మండలంలోని దుగ్గేరు గ్రామంలో ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు మక్కువ పోలీసులు మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ గిరిజనులకు, పోలీస్ శాఖ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. గిరిజన యువత చెడు మార్గంలో నడవకుండా, సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. గిరిజనులకు వైద్య సేవలు అందించిన జేమ్స్ హాస్పిటల్ రాగోలు, శంబర పీహెచ్‌సీ వైద్య బృందానికి అభినందనలు తెలియజేశారు. గిరిశిఖర గ్రామాల్లోని గిరిజనులు అందరికీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యం అందాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించి, మందులు అందజేసినట్లు ఏఎస్పీ తెలిపారు.

దుప్పట్లు, వాలీబాల్ కిట్లు పంపిణీ

కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు, మహిళలకు, దివ్యాంగులకు, ఏఎస్పీ అంకిత సూరాన దుప్పట్లు, నిత్యావసర సరుకులును పంపిణీ చేశారు. గిరిజన యువతలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు గుంటభద్ర, అలగురువు, బాగుజోల, దిగువ మెండంగి, తాడిపుట్టి గ్రామాల గిరిజన యువతకు ఉచితంగా వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మక్కువ ఎస్ఐ వెంకటరమణ, శంబర పీహెచ్‌సీ వైద్యులు సాహితీ, జేమ్స్ హాస్పిటల్ వైద్య బృందం, సీఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పార్వతీపురం రూరల్: రహదారి నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు వాహన చోదకులను హెచ్చరించారు. పట్టణంలో ఆర్టీసీ కూడలి, రాయగడ రోడ్డు కూడలి వద్ద ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు.

సర్వేలు వేగవంతం

పాలకొండ రూరల్: సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం నిర్దేశించిన పలు సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ వీవీ.గోపాలకృష్ణ, ఎంపీడీఓ వీవీ.రంగారావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సచివాలయ సిబ్బందితో పంచాయతీల వారీగా సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాట్సాప్ యాప్ నిర్వహణ, గృహ లబ్ధిదారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మెన్ మిస్సింగ్ వంటి సర్వేలు వేగవంతం చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో గ్రామీణలు ఆరోగ్య పరిరక్షణ, సీజనల్ సమస్యలు అధిగమించే క్రమంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. తాగు, సాగునీటి వనరులు, చేతి బోర్ల తాజా స్థితిగతులపై ఆరా తీశారు. రోజువారీ నివేదికలు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు.

ప్రహరీ నిర్మాణ పనులపై పర్యవేక్షణ కరువు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల చుట్టూ చేపడుతున్న ప్రహరీ నిర్మాణ పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. మండలంలోని మొత్తం 31 పంచాయతీలకు సంబంధించి, 45 ప్రహరీ నిర్మాణాల నిమిత్తం రూ.4.55 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ పనులను అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలే చేపడుతున్నారు. అయితే పనులు ఏ విధంగా జరుగుతున్నాయి.. పనుల్లో ఏ మేర నాణ్యత ఉందో పరిశీలించేందుకు అధికారులెవరూ రాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రహరీ నిర్మాణానికి వినియోగిస్తున్న ఇటుకల్లో నాణ్యత లేదని, వీటిపై అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, దశాబ్ద కాలంగా జియ్యమ్మవలస ఎంపీడీవో కార్యాలయం మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరుకుంటే దాని చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండడం చూసి జనం విస్తుపోతున్నారు. ప్రహరీ నిర్మాణాలు కేవలం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల జేబులు నింపేందుకేనని అంతా విమర్శిస్తున్నారు.



అధికారుల పర్యవేక్షణ లేకుండా జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

సర్వేలు వేగవంతం

పాలకొండ రూరల్: సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం నిర్దేశించిన పలు సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ వీవీ.గోపాలకృష్ణ, ఎంపీడీఓ వీవీ.రంగారావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సచివాలయ సిబ్బందితో పంచాయతీల వారీగా సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాట్సాప్ యాప్ నిర్వహణ, గృహ లబ్ధిదారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మెన్ మిస్సింగ్ వంటి సర్వేలు వేగవంతం చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో గ్రామీణలు ఆరోగ్య పరిరక్షణ, సీజనల్ సమస్యలు అధిగమించే క్రమంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. తాగు, సాగునీటి వనరులు, చేతి బోర్ల తాజా స్థితిగతులపై ఆరా తీశారు. రోజువారీ నివేదికలు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు.



సచివాలయ సిబ్బంది సమీక్షలో సూచనలు చేస్తున్న డీఎల్‌డీఓ, ఎంపీడీఓ

సర్వేలు పూర్తి చేయాలి

భామిని: ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ వై.సత్యం, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జియో ట్యాగింగ్, మిస్సింగ్, ఆధార్ నంబర్లు, నాన్ రెసిడెన్షియల్ సర్వే, హౌస్‌హోల్డ్ సర్వేల తీరుపై పలు సూచనలు చేశారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల ప్రభుత్వ గృహాలపై సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

లక్ష్యాలు అధిగమించాలి

గరుగుబిల్లి: నిర్దేశిత లక్ష్యాలు అధిగమించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఎల్‌పీవో ఎం.నాగభూషణరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఇంటి పన్ను బకాయిలను సకాలంలో వసూలు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగభూషణరావు

నీటికుంటల ఆవశ్యకతను గుర్తించాలి..



నీటికుంట తవ్వకాలను పరిశీలిస్తున్న ఏపీఓ, తదితరులు

పాలకొండ రూరల్: రైతులు నీటికుంటల (ఫారం పాండ్స్) ఆవశ్యకతను గుర్తించాలని ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ సూచించారు.

మండలంలోని వెలగవాడ, లుంబూరు, బద్దుమాసింగి, తదితర గ్రామాల పరిధిలో ప్రస్తుతం ఉపాధి పనుల్లో భాగంగా తవ్వుతున్న నీటికుంటల (ఫారమ్ పాండ్స్) తాజా పరిస్థితులను సరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. రైతులకు నీటికుంటలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. 32 పంచాయతీలకు సంబంధించి 800 ఫారమ్ పాండ్స్ ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించి, డార్మిటరీ గదులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు సాయంత్రం అందజేసే అల్పాహారాన్ని తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ, బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

పారదర్శకత పాటించాలి

జియ్యమ్మవలస: మండలంలోని అలమండ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఎస్.రమేష్ గురువారం సందర్శించారు. మార్చి ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ చేపట్టాలని, సామాజిక పింఛన్ల పంపిణీలో పారదర్శకత పాటించాలని సిబ్బందికి సూచించారు.

లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, పింఛన్ డబ్బులు అందివ్వాలని, 300 మీటర్ల దూరం కన్నా ఎక్కువ దూరం నుంచి పింఛన్ల పంపిణీ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

సామూహిక రుద్రాభిషేకం..

పాలకొండ మండలంలోని పెదకోటిపల్లిలో కొలువైన ఉమాకాత్యాయనీ సహిత విశ్వేశ్వర ఆలయంలో గురువారం సామూహిక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రుద్రాభిషేకం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈనేపథ్యంలో మార్చి ఒకటో తేదీ నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 91777 50873, 70367 41186 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

– పాలకొండ రూరల్



పరామర్శ

నగర పంచాయతీ మాజీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రాధాకుమారికి శస్త్రచికిత్స జరగడంతో ఎమ్మెల్సీ ఆమెను పరామర్శించి, రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. పరామర్శలో ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు వెలమల మన్మథరావు, కనపాక సూర్యప్రకాష్‌తో పాటు కౌన్సిలర్లు కడగల వెంకటరమణ, తుమ్మగుంట శంకరరావు, కోడెం విజయ్ కుమార్, పల్లా భాను, దుప్పడ పాపినాయుడు, కొంచడ అరుణ్‌కుమార్, తూముల లక్ష్మణరావు, కిల్లారి మోహనరావు, భాసూరు కాంతారావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, విశ్రాంత కమిషనర్ లీల్లీ పుష్పనాథం, యందవ మరియదాసు, సుంకరి ధర్మారావు తదితరులున్నారు.

– పాలకొండ రూరల్

